క్లుప్తంగా

ప్రవీణ్‌కుమార్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకుడు సామ్యూల్ ప్రవీణ్‌కుమార్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. చేంజింగ్ డైనమిక్స్ ఆఫ్ ఇండియా–యూఎస్ రిలేషన్స్ –ఏ స్టడీ ఆఫ్ యూపీఏ గవర్నమెంట్ టెన్యూర్ (2004–2014) అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ప్రవీణ్‌కుమార్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ తెలిపారు. పొలిటికల్ సైన్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు పి.సమ్మూలాల్ పర్యవేక్షణలో ప్రవీణ్‌కుమార్ తన పీహెచ్‌డీ పూర్తి చేశాడు. ప్రస్తుతం ప్రవీణ్‌కుమార్ హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి కళాశాలలో రాజనీతిశాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

కిట్స్ అధ్యాపకుడు శేషగిరికి..



హసన్‌పర్తి : కిట్స్ కళాశాల ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న శేషగిరి జిమ్మడి డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టక్నాలజికల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'అర్టిఫాక్ సప్రెషన్ ఆఫ్ ఈఈజీ సిగ్నల్ యూజింగ్ ఆర్మాఫాస్ట్–ఐ.సీ.ఏ' అనే అంశంపై పరిశోధనలు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కే.వీ.ఎస్.వీ.ఆర్.ప్రసాద్ పర్యవేక్షణలో పరిశోధనలు చేశాడు. శేషగిరిని కిట్స్ కళాశాల చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కోశాధికారి నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, రిజిస్ట్రార్ కోమల్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ వి. వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రభాకరాచారిలు అభినందించారు.


నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండ, కాజీపేటలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 6న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబ రెడ్డి తెలిపారు. కిషన్‌పుర, లష్కర్ బజార్ ప్రాంతంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, కాజీపేట మెయిన్‌రోడ్, రైల్వే స్టేషన్, డీ మార్ట్, సోమిడి, వెంకటాద్రి నగర్, జూబ్లీ మార్కెట్, రహమత్ నగర్, విష్ణుపురి ప్రాంతంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, సిద్ధార్థనగర్ ప్రాంతంలో ఉదయం 9.15 నుంచి 11.15 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 6న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఓ సిటీ, క్రిష్టియన్ కాలనీ, ఎస్ఆర్ నగర్, గాంధీనగర్, 100 ఫీట్ల రోడ్, రామన్నపేట, పిన్నవారి వీధి, బొల్లికుంట, ఖమ్మం మెయిన్‌రోడ్, మరియాపూర్, జోగయ్యపల్లి ప్రాంతాల్లో ఉదయం 9 నంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

కాజీపేట అర్బన్ : శాసనమండలి వైస్ చైర్మన్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాష్ ముదిరాజ్ నగరానికి చెందిన రెడ్డిపల్లి లలిత, సాంబరాజులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. హంటర్‌రోడ్డులోని ఆయన క్యాంపు కార్యాలయంలో చెక్కులను అందజేశారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదులు



హసన్‌పర్తి : ఇటీవల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన బీసీ రాజకీయ యుద్ధభేరీ సభలో రెడ్డి వర్గాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్య తీసుకోవాలని రెడ్డి ముచ్చర్ల, హసన్‌పర్తి శాఖ కోరింది. ఈ మేరకు సంఘం సభ్యులు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పత్రాన్ని సీఐ చేరాలుకు అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం సభ్యులు వీసం సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి, రాజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలి

విద్యారణ్యపురి : విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజారెడ్డి కోరారు. బుధవారం కళాశాలలోని ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఎల్ఈడీ బల్బులు తయారీపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వృత్తివిద్యపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె రజనీలత, వర్క్‌షాప్ రిసోర్స్ పర్సన్ మల్లేశం, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వేణుగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌కు స్థలం లేదట !

- విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరై నాలుగేళ్లు
- స్థలం కేటాయింపునకు అధికారుల కాలయాపన

హసన్‌పర్తి: మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరై నాలుగేళ్లు అయినప్పటికీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సర్కార్ స్థలం కేటాయించడానికి అధికారులు కాలయాపన చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలో సుమారు 22వేల సర్వీస్‌లు ఉన్నాయి. హసన్‌పర్తిలో అదనంగా మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి నాణ్యమైన కరెంట్ అందించాలనే ఉద్దేశ్యంతో నాలుగేళ్ల క్రితం విద్యుత్ ఉప కేంద్రం మంజూరు చేశారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా హసన్‌పర్తి, గంటూరుపల్లి, పెంబర్తి, సీతంపేట, ఈ ప్రాంతాల్లోని వ్యవసాయ రైతులకు విద్యుత్ అందించాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు.



చింతగట్టులోని సబ్‌స్టేషన్

అధికారుల కాలయాపన

స్థలం కేటాయించడానికి రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రంలోని చౌదరికుంటలో సుమారు 2.02 ఎకరాల ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంది. అలాగే పెద్దచెరువు వద్ద సుమారు ఎకరం స్థలం పడావ్‌గా ఉందని, ఇందిరమ్మ కాలనీలో కూడా ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

స్థలం కేటాయించాలి



సబ్‌స్టేషన్ కోసం స్థలం కేటాయించాలి. మూడు ప్రాంతాల్లో స్థలం అందుబాటులో ఉంది. విద్యుత్ శాఖ అధికారులను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి స్థలం చూపించామన్నారు.
– పావుశెట్టి శ్రీధర్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు

పెరుగుతున్న సర్వీస్‌లు



కాలనీలో రోజురోజుకు సర్వీస్‌లు పెరుగుతున్నాయి. దీంతో చింతగట్టు సబ్‌స్టేషన్‌పై భారం పడి విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. రెవెన్యూ అధికారులు స్పందించి, స్థలాన్ని కేటాయించాలన్నారు.
– చంద్రమోహన్, ఆత్మ మాజీ చైర్మన్

స్థలం కేటాయిస్తే తక్షణమే పనులు

స్థలం కేటాయిస్తే వెంటనే పనులు ప్రారంభిస్తాం. స్థలం కేటాయించకపోవడంతో నిధులు వెనక్కిపోయే ప్రమాదం ఉందన్నారు.
– అశోక్‌కుమార్, ఏడీఈ

7న నిర్వహించే మహాప్రదర్శన వాయిదా



సమావేశంలో మాట్లాడుతున్న మంద కుమార్ మాదిగ

- ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ

హన్మకొండ: హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించనున్న లక్ష డప్పులు, వేల గొంతుల మహా ప్రదర్శన కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ తెలిపారు. బుధవారం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కుమార్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీల జనాభాలో అధిక భాగంలో ఉన్న మాదిగలకు కేటాయించిన రిజర్వేషన్ శాతాన్ని పెంచి 11 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం మాలలకు లాభం అయ్యేలా వర్గీకరణ చేసిందని, దీన్ని వెంటనే సవరించి ఎస్సీల వర్గీకరణలో ఏ గ్రూప్ వారికి 11 శాతం, సీ కేటగిరిలోని మాల ఉపకులాలకు మూడు శాతం ఇవ్వాలని లేని ఎడల మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో మరో పోరాటానికి సిద్ధమవుతామన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు గద్దల సుకుమార్, వేల్పుల సూరన్న కాపు, బొడ్డు దయాకర్ మాదిగ, దినేష్, మంద రాజు, సురేందర్, వెంకటస్వామి, భిక్షపతి మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర యూనివర్సిటీ ఇన్‌చార్జ్ రెహమాన్

కేయూ క్యాంపస్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని రాబోయే బడ్జెట్‌లోనైనా ప్రభుత్వం విద్యారంగానికి కనీసం 15 శాతం నిధులు కేటాయించాలని ఏఐ ఎస్ఎఫ్ రాష్ట్ర యూనివర్సిటీల ఇన్‌చార్జ్ రెహమాన్ డిమాండ్ చేశారు. కేయూ లోని దూరవిద్యా కేంద్రంలోని సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఆ విద్యార్థి సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరు ప్రణీత్‌గౌడ్, ఉపాధ్యక్షుడు కె.కుమార్, బాధ్యులు రవితేజ, వినయ్ తదితరులు పాల్గొన్నారు. ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా సాయికృష్ణ, కో కన్వీనర్‌గా వి. నితిన్, బి.అవినాష్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న రెహమాన్

అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

ఖిలా వరంగల్ : వరంగల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని, అలాగే వరంగల్‌ను తెలంగాణ రాష్ట్రానికి రెండో రాజధానిగా తీర్మానం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో తాళ్లపెల్లి రోహేలా అధ్యక్షతన జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలను పక్కాగా అమలు చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లాసహాయ కార్యదర్శులు ఎస్.కె.బాష్మియా, పనాస ప్రసాద్, బుస్సా రవీందర్, రమేష్, మునీశ్వరుడు, బద్రి, ఎలేందర్, రాజు, ఎండి అక్బర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

కార్మికుల హక్కులు కాలరాస్తున్న కేంద్రం

- ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి

హన్మకొండ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులు కాలరాస్తుందని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, కార్యదర్శి జక్కు రాజు గౌడ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజించి కేంద్ర ప్రభుత్వం కార్మికుల పొట్ట కొట్టాలని చూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏప్రిల్ నుంచి నాలుగు కోడ్‌లను చేయాలని చూస్తుందని వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల అనుమతి లేకుండానే రైల్వే ట్రాక్‌లు, జాతీయ, జిల్లా రహదారులకు భూములను లాక్కునే విధంగా మూడు నల్ల చట్టాలు తీసుకువచ్చిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు ఏల్పుల ధర్మరాజు, రాజేష్ ఖన్నా, బొక్క ఏలియా, సందీప్ కుమార్, అశోక్, మల్లయ్య, సదానందం, రామ్మూర్తి, ఎ.ఎల్లస్వామి, శ్రీధర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

బీసీలకు 56 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



హన్మకొండ: బీసీలకు విద్యా, ఉద్యోగ, చట్ట సభల్లో 56 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి అన్నారు. బుధవారం సుబేదారిలోని జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జనగణనతో పాటు కులగణన చేయడం ద్వారా మొత్తం జనాభాలో బీసీ సమాజం 56 శాతం ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ మేరకు రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరముందన్నారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి బీసీల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బత్తిని సదానందం, ఉపాధ్యక్షుడు గుంటి రాజేందర్, బీకేఎంయూ గౌరవ అధ్యక్షుడు ఏదునూరి వెంకట్రాజం, ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కుల, జనగణనకు తీర్మానం చేయాలి

వరంగల్ : దేశంలో రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేసి కుల,జనగణన చేయడానికి రాష్ట్రపతి ఉత్తర్వులను ఇప్పించాలని, కుల జనగణన ప్రకారమే విద్యా, ఉద్యోగాల్లో, చట్టసభల్లో ఎవరి వాటా వారికి ఇవ్వాలని కోరుతూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. బుధవారం వరంగల్ కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రికి పంపించాలని కోరుతూ మెమోరాండంను డీఆర్ఓ విజయలక్ష్మికి అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కుల గణన ప్రకారం 56 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వలబోజు వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓర్సు రాజు, జిల్లా సహాయ కార్యదర్శులు చీకటి ప్రకాష్, బొట్ల శ్రీనివాస్, బచ్చలి స్వప్న, వైశాలి వీరస్వామి, శ్రీవారి, చంద్రశేఖర్, రమేష్ పాల్గొన్నారు.



డీఆర్‌ఓకు మెమోరాండం అందజేస్తున్న బీసీ హక్కుల సాధన సమితి నాయకులు

'ఓఎస్‌డీ పదవి నుంచి తొలగించాలి'

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఓఎస్‌డీగా ఇటీవల నియామకమైన ప్రొఫెసర్ పి. మల్లారెడ్డిని ఆ పదవి నుంచి తొలగించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ డిమాండ్ చేశారు. బుధవారం కేయూలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో ఓఎస్‌డీ పదవీ అనేది గతంలో లేదని ఇప్పుడు కొత్తగా క్రియేట్ చేసి మల్లారెడ్డిని నియమించటం సరికాదన్నారు. సమావేశంలో ఏబీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు దూడపాక నరేందర్, బాధ్యులు గణేష్, భరత్, కిరణ్,సాయి, వెంకటేష్, సూర్య, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోలీస్‌స్పోర్ట్స్ మీట్‌లో కాశీరామ్ ప్రతిభ

ఖిలా వరంగల్: ఇటీవల కరీంనగర్‌లోని పోలీస్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో జరిగిన రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ఆర్ఐ కాశీరామ్ ఆయుధాలపై నైపుణ్యత ప్రదర్శనలో ద్వితీయస్థానం, హెడ్ కానిస్టేబుల్ ఎం.దేవేందర్ యోగాసనాల్లో ద్వితీయ స్థానంలో నిలిచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. బుధవారం డీజీపీ కార్యాలయంలో కాశీరామ్, హెడ్‌కానిస్టేబుల్ దేవేందర్‌ను పోలీస్ అకాడమీ జాయింట్ డైరెక్టర్ దాసరి మురళితో కలిసి తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్, డీజీపీ ట్రైనింగ్ అభిలాష్ బిష్త్ ఐపీఎస్ అభినందించారు.

నర్సిరెడ్డిని గెలిపించాలి

విద్యారణ్యపురి : వరంగల్, నల్గొండ, ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీగా మరోసారి గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి కోరారు. బుధవారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. సాయంత్రం హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను విడుదలచేయాలని టీఎస్‌యూటీఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.రవీందర్‌రాజు, రాష్ట్ర కమిటీ సభ్యుడు డి కిరణ్‌కుమార్, బాధ్యులు పాల్గొన్నారు.

పోలీసులపై చర్య తీసుకోవాలి

వరంగల్ లీగల్ : న్యాయవాది గంధం శివతో అమర్యాద, అనుచితంగా ప్రవర్తించి దాడికి పాల్పడిన తీరుపై ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి, ఎస్సై, కానిస్టేబుళ్లపై చర్య తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కోర్టు ఎదుట వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదులు పెద్దఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కోర్టు ఎదుట భైఠాయించి నినాదాలు చేస్తూ సంబంధిత పోలీస్ అధికారులపై వెంటనే తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్ధన్, సీనియర్ న్యాయవాదులు సహోదర్‌రెడ్డి, అంబరీష్‌రావు, బార్ అసోసియేషన్ల బాధ్యులు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.



కోర్టు ఎదుట నిరసనలో పాల్గొన్న న్యాయవాదులు

సంక్షిప్త సమాచారం

ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ సంబురాలు


హన్మకొండ: ఎస్సీ వర్గీకరణ ప్రకటనపై కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. బుధవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ అనుబంధ ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్లతో సంబురాలు జరుపుకున్నారు.

హసన్‌పర్తి: ఎస్సీ వర్గీకరణకు తెలంగాణ రాష్ట్ర కేబినెట్ ఆమోదించడంపై కాంగ్రెస్ శేణులు హర్షం వ్యక్తం చేశారు. 56వ డివిజన్ గోపాలపురం, 66వ డివిజన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు.

మోదీ ప్రభుత్వానిది రైతు వ్యతిరేక బడ్జెట్

వరంగల్: పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపట్టిందని ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్లు రాచర్ల బాలరాజు, సోమిడి శ్రీనివాస్ అన్నారు. రైతు వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం కాశిబుగ్గ జంక్షన్‌లో ఎస్‌కేయం నాయకులు బడ్జెట్ ప్రతులను తగులపెట్టారు.

జాతీయ జూడో పోటీలకు విక్రమ్



వరంగల్ : జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూడో కోచింగ్ సెంటర్ నుంచి ఎం.విక్రమ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడల అధికారిణి సత్యవాణి తెలిపారు. విక్రం జనరల్ కోచ్ కుమారస్వామి వద్ద శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. ఉత్తరాఖండ్ డె హ్రాడూన్‌లో జరగనున్న జాతీయ జూడో పోటీల్లో పతకాన్ని సాధించి తెలంగాణకు, వరంగల్ జిల్లా క్రీడా రంగానికి మంచిపేరు తేవాలని కోరుతూ జ్ఞాపికను సత్యవాణి అందజేశారు.

డంపింగ్‌యార్డు సమస్యపై వినతి

మడికొండ : గ్రేటర్ వరంగల్‌లోని 46వ డివిజన్ మడికొండ–రాంపూర్ మధ్యలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిపై అడ్‌హక్ కమిటీ వేసుకోగా కొద్ది రోజులుగా అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని స్థానిక సీఐ కిషన్‌ను కోరారు.

అవగాహన సదస్సు

హన్మకొండ : బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వీ–గార్డ్, చాయ్ సంస్థల సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. దేశ్‌పాండే మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు ఎలాంటి సహకారం అవసరమున్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు.

జనాభా ప్రాతిపదికన అమలు చేయాలి

వరంగల్ : బీసీ జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమల్లో 50 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని చట్టసభల్లో బీసీ వాటాపై పార్లమెంట్‌లో బిల్లు తీసుకురావాలని బీసీ హక్కుల సాధన నాయకుడు పంజాల రమేశ్ అన్నారు. బుధవారం వరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అనంతరం వినతిపత్రం అందజేశారు.


తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

హసన్‌పర్తి : తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని సానిటరి ఇన్‌స్పెక్టర్ బాషానాయక్ సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా తడి, పొడి చెత్తను వేరే చేసే ప్రక్రియపై నగరంలోని 1, 55, 56, 65, 66 డివిజన్ల పరిధిలోని కార్మికులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. భీమారంలోని పొద్దుటూరి గార్డెన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

పరీక్షల నియంత్రణాధికారిగా సుధీర్

కేయూ క్యాంపస్ : హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) పరీక్షల నియంత్రణాధికారిగా కంప్యూటర్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్‌ను నియమిస్తూ ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో ఆయన ఒక సంవత్సరం పాటు కొనసాగుతారని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పరీక్షలను నిర్వహించాలని సూచించారు.

ఆరోగ్య అవగాహన సదస్సు



మడికొండ : మడికొండలోని సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో బుధవారం వరంగల్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సీపీఆర్ ట్రైనింగ్ సెషన్, ఆరోగ్య అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్లు పోలీసులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎండి ఫిజీషియన్ డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ లక్ష్మీదీపక్ నాగుల్, సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ ప్రవీణ్, అడిషనల్ కమాండెంట్ సుబ్రమణ్యం, 70 మంది పోలీసులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని మోటారు సైకిలిస్టు మృతి



సదానందం(ఫైల్)

వరంగల్ : ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డిపాలెం జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముస్త్యాలపల్లికి చెందిన సిద్దోజు సదానందం(55) అక్కడికక్కడే మృతి చెందినట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు. గొర్రెకుంట నుంచి కొత్తపేట వైపు వెళ్తున్న లారీ ముస్త్యాలపల్లి నుంచి కాశిబుగ్గ వైపు వెళ్తున్న మోటారు సైకిల్‌ని ఢీకొట్టిందన్నారు. ఈ ఘటనలో సదానందం తలకు బలమైన గాయాలు కాగా అక్కడికక్కడే మరణించినట్లు తెలిపారు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

వరంగల్ : ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆరెపల్లి శివారు ప్రధాన రహదారి పక్కన ఉన్న పాడుబడ్డ వ్యవసాయ బావిలో ఒక వ్యక్తి మృతదేహం పడి ఉందని మునిసిపల్ జవాన్ హరీష్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. బుధవారం బావి వద్దకు వెళ్లి అందులో నుంచి మృతదేహాన్ని బయటకు తీసినట్లు తెలిపారు. మృతుడు చనిపోయి సుమారు 15 రోజులు పైన అవుతుందని, మొహం గుర్తుపట్టలేని స్థితిలో ఉందని, మృతుడి ఒంటిపై నల్ల రంగు ప్యాంట్, ఆకుపచ్చ రంగుపై పసుపు రంగు అడ్డగీతల టీ షర్ట్ ధరించి సుమారు 50 నుంచి 55 సంవత్సరాలు ఉండవచ్చని తెలిపారు. ఈ వ్యక్తిని గుర్తుపడితే ఏనుమాముల సీఐ 88126 85120, ఎస్సై 87126 85288లకు సమాచారం అందించాలని తెలిపారు.


విద్యుత్ స్తంభాలను ఢీకొట్టిన లారీ

ఖిలా వరంగల్: వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఉర్సు గుట్ట సమీపంలో బుధవారం ఉదయం లారీ టైర్ పేలి వాహనం అదుపు తప్పి ఒక్కసారిగా వీధిదీపాల స్తంభాలను ధ్వంసం చేస్తూ డివైడర్‌ను ఢీకొట్టి నిలిచింది. విద్యుత్ అధికారులు హుటాహుటిన చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభాలను వెంటనే తొలిగించారు. ఈ ఘటనలో లారీడ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయపడ్డారు. మిల్స్‌కాలనీ పోలీసులు, రవాణాశాఖ అధికారులు వివరాలు సేకరించినట్లు తెలిసింది.

గుట్కాస్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖిలా వరంగల్ : వరంగల్ శంభునిపేటలో కిరాణం షాపుల్లో గుట్కా ప్యాకెట్లను అక్రమంగా నిల్వ చేసి ఇతరులకు విక్రయిస్తున్న వ్యాపారులు శంకేసి లింగమూర్తి, కొమ్మాకుల ప్రభాకర్‌లపై బుధవారం కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సార్ల రాజు తెలిపారు. వారి నుంచి రూ. 38,300ల విలువైన గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు.

మాదిగ జాతి ఔన్నత్యానికి తోడ్పడాలి



దప్పులు పంపిణీ చేస్తున్న సుజాత

కేయూ క్యాంపస్ : మాదిగ జాతి ఔన్నత్యాన్ని కాపాడేందుకు తోడ్పడాలని కాకతీయ యూనివర్సిటీ మాదిగ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ సుజాత అన్నారు. ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించబోయే లక్ష డప్పులు, వేయి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం కేయూ ఇంజనీరింగ్ కళాశాల ఉద్యోగులకు ఉచితంగా డప్పులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేయూ ఇంజనీరింగ్ కళాశాల సూపరింటెండెంట్ బొల్లేపాక ప్రభాకర్, డాక్టర్ సంగాల ఎఫ్రిమ్‌రాజు, మందశ్యామ్, ఇంద విజయరావు, సుధీర్, నాగరాజు, శోభన్, విజయ్ పాల్గొన్నారు.

మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



మామునూరు : ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ప్రజారంజక బడ్జెట్ సందర్భంగా బుధవారం వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బన్న ప్రభాకర్, బీజేపీ నేత జలగం రంజిత్ ఆధ్వర్యంలో మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. బీజేపీ నేతలు వీరస్వామి, దయాకర్, సుధాకర్, రమేష్, సాంబయ్య, అభినయ్, రాందాస్, నరసయ్య, నాగరాజు పాల్గొన్నారు

హసన్‌పర్తి : ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రయోజకంగా ఉందని హర్షిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ కుమారస్వామి, బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి, రాజేశ్వర్‌రావు, రమేష్, శ్రీనివాస్, మధుసూదన్ పాల్గొన్నారు.